క్లుప్తంగా

24 గంటలూ అందుబాటులో టోల్‌ఫ్రీ నంబర్

కాకినాడ: మంచినీటి సరఫరా సమస్యలు, వీధి దీపాలు, పారిశుధ్యం, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల పరిష్కారానికి నిరంతరాయంగా 24 గంటలూ పనిచేసేలా టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో ఎదురయ్యే డయేరియా వ్యాధుల తోపాటు ఆయా సమస్యలపై నేరుగా టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చునని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత విభాగాలు ద్వారా సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1800 4255 990కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీహెచ్‌సీలో రెసిడెంట్ డాక్టరు నియామకానికి కృషి

కాకినాడ రూరల్: పండూరు పీహెచ్‌సీలో సాయంత్రం 5 గంటలకు వైద్యులు అందుబాటులో ఉండటంతో లేదని గ్రామస్తులు చెబుతున్నారని, రెసిడెంట్ డాక్టరు ఏర్పాటుకు, శిథిలమైన భవనాలను తొలగించి నూతన నిర్మాణాలకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నానాజీ అన్నారు. పండూరు పీహెచ్‌సీని ఎమ్మెల్యే నానాజీ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా నిర్మూలనకు ప్రభుత్వం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని 24 సచివాలయాల్లో కేవలం రెండు, మూడు డయేరియా కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. పండూరులో కార్యక్రమాన్ని వైద్యులు శిరీషా, ఆయేషా, మాధవి, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చేపడుతున్నారు. ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వినోద్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు



సినీ నటి భూమికా చావ్లా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వినోద్

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద గల వీజేఎస్ఎంఆర్ ఓడిగోస్ టెక్నాలజీస్ ఎండీ వారా వినోద్ తెలంగాణ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకోవడం అభినందనీయమని సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టరు మూర్తిరాజు పేర్కొన్నారు. రమణయ్యపేటలోని సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అభినందన సభలో నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం పొందేందుకు శిక్షణ అందిస్తున్న వినోద్ బెస్ట్ రీజినల్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ రిక్రూట్‌మెంట్ కంపెనీ కేటగిరిలో అవార్డును సినీ నటి భూమికాచావ్లా చేతుల మీదుగా హైదరాబాద్‌లో అందుకున్నారని మూర్తి రాజు పేర్కొన్నారు. పోస్టల్ యూనియన్ నాయకుడు వారా సత్యనారాయణ, డాక్టరు వంశీకృష్ణ రాజు, గగారిన్, ఏసుదాసు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో పంచామృతాభిషేకం

పెద్దాపురం: పట్టణంలో మరిడమ్మవారి ఆలయంలో సోమవారం ఆయుష్ హోమం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కార్యనిర్వహణాధికారి, గ్రామ పెద్దలు, భక్తులు హాజరై మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

శృంగార వల్లభ స్వామి హుండీ ఆదాయం లెక్కింపు

పెద్దాపురం: పెద్దాపురం మండలం తిరుపతిలో వేంచేసియున్న శృంగార వల్లభస్వామి హుండీ ఆదాయం రూ. 26,97,425 వచ్చినట్టు నిర్వాహకులు సోమవారం తెలిపారు. స్వామి వారి హుండీలో 103 రోజులకు రూ. 26,97,425, అన్నదాన హుండీలో రూ.6,85,052 మొత్తం రూ.33,82,477 వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంఎస్ఎన్ చారిటీస్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్‌వీ చందన, దేవదాయశాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయబాబు నాయుడు, జోకా సత్యనారాయణ, సర్పంచ్, అర్చకులు పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, కాండ్రకోట చైతన్య గోదావరి బ్యాంక్ సిబ్బంది, స్వామి వారి సేవకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: ప్రస్తుతం వాతావరణ మార్పుల నేపథ్యంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సౌజన్య సూచించారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. దోమల వ్యాప్తిని నియంత్రించాలన్నారు. దోమలు కుట్టడం వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా జ్వరాలు వస్తాయన్నారు. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఇళ్ల మధ్య డ్రమ్ములు, వాటర్ ట్యాంకులు, సంపులు, పూల కుండీలు, రుబ్బురోళ్లు, పూల కుండీలు, పాత టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు, ఐస్‌క్రీం కప్పుల్లో నీరు నిల్వ ఉండే దోమలు పెరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల మధ్య నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

సార్వా సాగుకు ఆటంకం

- సంపర కాలువలో అడుగంటిన నీరు
- సాగునీరందక రైతులు గగ్గోలు
- ఆలస్యమవుతున్న నారుమళ్లు
- పట్టించుకోని అధికారులు



కూరాడ డ్యామ్‌వద్ద వర్షం నీటితో ఉన్న సంపర బోదె



వాకాడ వద్ద సంపర బోదె కాలువలో అంతంతమాత్రంగా నీరు



వాకాడ సమీపంలో కాలువ నీరు రాక దమ్ము ప్రారంభించని పంట పొలాలు

కరప: ఇరిగేషన్ శాఖాధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా పరిణమించింది. సంపర బోదె (పంట కాలువ)లో చుక్కనీరు రాక సార్వా సాగు ముందుకు సాగడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంట కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీరందక నారుమళ్లు వేసుకోవడం ఆలస్యమవుతోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సంపర బోది కాలువలో నీరు రాకపోవడంతో దమ్ము చేసుకోవడానికి అవస్థలు పడుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. అన్ని మండలాల్లో నారుమళ్లు వేసుకోవడం పూర్తయినా ఈ పంట కాలువ ఆయకట్టు పరిధిలోని కూరాడ, వాకాడ, వేములవాడ, కరప, వలసపాకల గ్రామాలకు సాగునీరందక పోయినా అధికారులు పత్తాలేకుండా పోయారని, తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఇంకెన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముందుకు సాగని నారుమడి పనులు

జూన్ నెలాఖరుకల్లా నారుమళ్లు వేసుకోవడం పూర్తి చేసి, జూలై నెలాఖరు నాటికి వరినాట్లు పూర్తి చేయాలని వ్యవసాయాధికారులు సూచించారు. అధికారుల సూచనల మేరకు సాగు పనులు చేసుకుందామనుకుంటే, జూన్ నెల చివరిలో కురిసిన వర్షం నీరు ఆధారంగానే నారుమళ్లు వేసుకున్నామని రైతులు అంటున్నారు. మెరక ప్రాంత భూముల్లో నారుమళ్లు వేసుకోవడం ఆలస్యమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ ఆలస్యమైతే నవంబరులో వచ్చే తుఫాన్లకు పంట పొలాలు ముంపునకు గురై, నష్టపోవాల్సి ఉంటుందని రైతులు అంటున్నారు.

రైతులకు కంటిపై కునుకు కరువు

కంటిమీద కునుకు లేకుండా కాలువల చుట్టూ తిరుగుతున్నా చుక్కనీరు రావడంలేదని వాకాడ, వేములవాడ, కరప రైతులు అంటున్నారు. మండల పరిధిలోని భూములకు సంపర బోదె ద్వారానే కూరాడ, వాకాడ, వేములవాడ, కరప, వలసపాకల తదితర గ్రామాల్లోని ఆయకట్టుకు సుమారుగా 8 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేస్తారు. మండలానికి శివారుగా ఉండే గ్రామాలకు సాగునందించే. ఈ కాలువను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే జూలైలో నారుమళ్లు వేయడానికి ఇంతవరకు దమ్ము చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందంటున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి దమ్ముచేసిన పొలాలకు నీరందక ఆరిపోతున్నాయని రైతులు అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంపర బోదె కాలువకు పూర్తిస్థాయిలో నీళ్లొదిలి వరినాట్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుకుంటున్నారు.

డీఈఈ వివరణ : సంపర బోదె కాలువకు సాగు నీరు రాకపోవడంపై ఇరిగేషన్ డీఈఈ ఆకెళ్ల రవికుమార్‌ను వివరణ కోరగా రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. సోమవారం ఏఈఈ ఎన్.భవానీని కాలువ పరిశీలించాలని సూచించామన్నారు. కూరాడ డ్యామ్ ఎగువను గుర్రపుడెక్క పెరిగిపోవడంతో కిందికి నీరెళ్లడం లేదన్నారు. గుర్రపుడెక్క తొలగించి, సాగునీరందేలా చర్యలు తీసుకుంటున్నామని డీఈఈ అన్నారు.

ఆలయాల అభివృద్ధికి నారాయణమూర్తి విశేష కృషి



పులి నారాయణమూర్తి దంపతులను సత్కరిస్తున్న దేవదాయశాఖ డీసీ మేడేపల్లి విజయరాజు తదితరులు

బోట్‌క్లబ్: జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి ఎంతో నిబద్ధతతో పని చేశారని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు కొనియాడారు. జిల్లా దేవదాయశాఖాధికారి పని చేసి పదవీ విరమణ చేసిన పులి నారాయణమూర్తి వీడ్కోలు సభ స్థానిక ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించారు. నూతన కాకినాడ జిల్లా ఏర్పడిన తర్వాత తొలి జిల్లా దేవదాయశాఖాధికారిగా నియమితులై అందరికీ అందుబాటులో ఉన్నారన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తొలి తిరుపతి శృంగారవల్లభ స్వామి, సామర్లకోట కుమార భీమేశ్వరస్వామి దేవస్థానం, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంతోపాటు పలు ఆలయాలు, సత్రాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేశారని అన్నారు. ఈ సందర్భంగా డీసీ ఆధ్వర్యంలో పులి నారాయణమూర్తి దంపతులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి ఆలయ ఈఓ డీసీ చక్రధరరావు, దేవదాయశాఖ డీసీ కార్యాలయ సూపరిండెంటెంట్లు నాగేశ్వరరావు, తోట సుబ్రహ్మణ్యం, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్లు ఫణికుమార్, సతీష్‌కుమార్ పలు దేవాలయాలు, సత్రాలకు చెందిన ఈవోలు పాల్గొన్నారు.

ఎంపీపీగా విరీష బాధ్యతల స్వీకరణ



ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన బందిలి విరీషను అభినందిస్తున్న నాయకులు

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలుగా తిమ్మాపురం ఎంపీటీసీ - 1, వైస్ ఎంపీపీ బందిలి విరీష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు సమక్షంలో ఆమె ఎంపీపీగా సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీపీగా పనిచేసిన గోపిశెట్టి పద్మజ రాజీనామా చేయడంతో ఎంపీపీ ఎన్నిక పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా బాధ్యతలు చేపట్టాలని వైఎస్ ఎంపీపీ విరీషను జెడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి ఉత్తర్వుల ద్వారా ఆదేశాలివ్వడంతో ఎంపీడీఓ సమక్షంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎంపీపీ విరీషను జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, వైఎస్ ఎంపీపీ గుత్తుల సత్తిబాబు, ఎంపీటీసీలు ముద్దన వెంకట్రాజు, చవ్వాకుల గంగాభవాని, వాసంశెట్టి సత్యవేణి, నాయకులు పుల్ల కోటేశ్వరరావు, గీసాల శ్రీనివాసరావు, శ్రీనుచంద్ర, ఊబా శ్రీను అభినందించారు. బాధ్యతలు చేపట్టిన తరువాత మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును విరీష మర్యాదపూర్వంగా కలిసి, ధన్యవాదాలు తెలియజేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న ఐడియల్ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రక్తదానం ప్రాణదానంతో సమానమని రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ ఎస్‌పీఎస్ రావు అన్నారు. కాకినాడ విద్యుత్ నగర్‌లోని ఐడియల్ ఇంజనీరింగ్ రోటరీ క్లబ్, రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సరైన సమయంలో రక్తం అందక ఎంతో మంది రోగులు చనిపోతున్నారన్నారు. రక్తదానం చేసేందుకు ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఏడాదిలో చక్కటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి రోటరీ డిస్ట్రిక్ట్‌లో ఉత్తమ క్లబ్‌గా గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. క్లబ్ శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం విముక్తి కాలనీలో డాల్ఫిన్ వెంకన్న సౌజన్యంతో పూర్ ఫీడింగ్ కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ సెక్రటరీ దామెర శ్రీకాంత్ అసిస్టెంట్ గవర్నర్ ధనసాగర్ ప్రసాద్, సభ్యులు నెక్కంటి శ్రీనివాస్, పాడిశెట్టి సుబ్రహ్మణ్యం, సత్యపాల్ పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుక



డాక్టర్లను సత్కరించిన లయన్స్ క్లబ్ సభ్యులు



అడ్డాల సత్యనారాయణను సత్కరిస్తున్న లయన్స్ ప్రొఫెషనల్ క్లబ్ సభ్యులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జూలై 1 జాతీయ డాక్టర్స్ డేను పురస్కరించుకుని నగరంలో రామారావుపేటలోని నారాయణ స్కూల్, సాంబమూర్తి నగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. నారాయణ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ షర్మిల అధ్యక్షత వహించారు. లయన్స్ క్లబ్ స్టార్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్లు సాయి సుసాబ్, వినీల ప్రియాంక, జి.రామాంజనేయులు, ఎం.జీవన్‌జ్యోతిని దుశ్శాలువాతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ వైద్యుడిని కనిపించే దేవుడిగా ప్రజలందరూ పరిగణిస్తారన్నారు. దేవుడు జన్మనిస్తే వ్యాధుల నుంచి కాపాడి వైద్యులు పునర్జన్మను ఇస్తారని తెలిపారు. అటువంటి వారిని గౌరవించడం, అభినందించడం మన అందరి కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డీన్ రమణారావు, ఈచాంప్స్ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శిరీష, ఉపాధ్యాయులు లైలా, కాంచన, అవేరా, శాంతి, మౌళవిక, లయన్స్ క్లబ్ కార్యదర్శి ఇంద్రగంటి నాగేశ్వరరావు, ట్రెజరర్ జి.నాగమణి పాల్గొన్నారు. ఆదిత్య కళాశాలలో డాక్టర్ మాధవీలత అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె. కరుణ సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి మానసిక, శారీరక ఆరోగ్యం చాలా అవసరం అన్నారు. పోషకాహారం తీసుకోవాలని, పాజిటివ్ థింకింగ్ అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బీవీఎల్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సురేఖ పాల్గొన్నారు.

దంత వైద్యుడు అడ్డాలకు సత్కారం

బోట్‌క్లబ్: లయన్స్ కాకినాడ ప్రొఫెషనల్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని దంత వైద్యశాలలో వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రముఖ దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణను సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 25 ఏళ్లుగా దంత వైద్య రంగంలో పనిచేస్తూ, సమాజ సేవలు నిర్వహిస్తున్న అడ్డాలను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అడ్డాల మాట్లాడుతూ బీసీ రాయ్ జయంతి సందర్భంగా డాక్టర్స్ డే నిర్వహించుకుంటున్నామన్నారు. ఇటువంటి మహనీయుడు అడుగుజాడల్లో అందరూ నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, షబ్బీర్, సుధీర్, భవానీ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కమిషనర్ జె.వెంకటరావు



నేమాంలో సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ



గొర్రిపూడిలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కాకినాడ: పేద ప్రజల జీవితాలకు భరోసా కల్పించాలనే లక్ష్యంతోనే పింఛన్ల సొమ్మును పెంచాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) పేర్కొన్నారు. స్థానిక 6వ డివిజన్ కొత్త కాకినాడ ప్రాంత సచివాలయ ప్రాంతం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే సోమవారం శ్రీకారం చుట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి పింఛన్లను పంపిణీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో 30,552 మందికి ఇంటి వద్దకే పింఛన్లను పంపిణీ చేసేలా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు పంపిణీ చేశారు.

కాకినాడ రూరల్‌లో 34వేల మందికి పింఛన్లు

కాకినాడ రూరల్: ఎన్నికల హామీల అమలులో భాగంగా సామాజిక పింఛన్లను అందిస్తున్నట్టు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. మండలంలోని నేమాం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. నేమాం, పండూరు, తిమ్మాపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకినాడ రూరల్ నియోజకవర్గంలో మొత్తం 34వేల లబ్ధిదారులకు రూ.23.60 కోట్ల పింఛన్ల సొమ్ములు పంపిణీ చేస్తామన్నారు. వృద్ధులకు, వితంతులకు రూ.4వేలుతో పాటు ఏప్రిల్ నుంచి రూ.వెయ్యి రూపాయలు చొప్పున మొత్తం రూ.7వేలు చొప్పున అందించామన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు పర్యవేక్షించారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ దంపతులు పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

కరప మండలంలో 91.32 శాతం పంపిణీ

కరప: మండల పరిధిలో సోమవారం సాయంత్రానికి 91.32 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో పింఛన్‌దారులు 11,573 మంది ఉండగా రూ.7,76,04,500 ఇవ్వాల్సి ఉందన్నారు. వీరిలో 10,569 మంది లబ్ధిదారులకు రూ.7,08,52,000 గ్రామ సచివాలయం సిబ్బంది, వీఆర్వోలు తదితర ప్రభుత్వోద్యోగులు లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్ ఇచ్చారన్నారు. సిరిపురం గ్రామ సచివాలయం 97.69 శాతం, కొరిపల్లి సచివాలయం 97.09 శాతం, వేళంగి-1 సచివాలయం 96.8 శాతంతో వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయన్నారు. ఈఓపీఆర్డీ బీవీ సత్యనారాయణ, గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణలో లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్ అందజేశారన్నారు. ఆలస్యమైనా మొదటిరోజు 98 శాతం పూర్తి చేయమని చెప్పామన్నారు. సర్వర్ పనిచేయక, సిగ్నల్స్ లేక మధ్యాహ్నం వరకు పింఛన్ల పంపిణీ మందకొడిగా సాగింది. మిగిలిన లబ్ధిదారులకు మంగళవారం అందజేస్తామని ఎంపీడీఓ అప్పారావు వివరించారు.

సౌకర్యం, గొప్ప ధ్వని హెడ్‌ఫోన్ల సొంతం

- విరివిగా పెరిగిన హెడ్‌ఫోన్ల వినియోగం
- ఆసక్తి చూపిస్తున్న యువత
- ఫోన్‌తోపాటు కొనుగోలు



మార్కెట్ అందుబాటులో ఉన్న వివిధ రకాల హెడ్‌ఫోన్స్

బోట్‌క్లబ్ : హెడ్‌ఫోన్లు, ఇయర్ ఫోన్లు, ఇయర్ బడ్స్ సంగీత ప్రియుల మనస్సులు దోచుకుంటున్నాయి. ప్రస్తుతం ఇవి సెల్‌ఫోన్ వినియోగదారుల శరీరంలో ఒక ఒక భాగంగా మారిపోయాయి. ఇంట్లో ఉన్నా, బయటకు వెళ్లినా, బస్‌లో ప్రయాణం చేస్తున్నా చాలా మంది చేతిలో సెల్‌ఫోన్ దానికి అనుసంధానంగా ఇటీవల హెడ్‌ఫోన్లు చెవిలో పెట్టుకుని వారి లోకంలో మునిగిపోతున్నారు. ఫోన్ కాల్ మాట్లాడడం, పాటలు వినడం, వీడియోలు చూడటానికి సౌకర్యవంతంగా నాణ్యమైన ధ్వని అందించే హెడ్‌ఫోన్‌ను వినియోగిస్తున్నారు. చాలామంది సెల్‌ఫోన్‌తోపాటు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇయర్ ఫోన్స్, ఇయర్ బడ్స్ పెట్టుకొంటే వినికిడి సమస్య వచ్చే అవకాశం ఉండడంతో యువత ఎక్కువగా హెడ్‌ఫోన్లు వినియోగిస్తున్నారు. ఇయర్ బడ్స్ చిన్నవిగా ఉండి చెవుల నుంచి జారి పడుతుంటాయి. హెడ్‌ఫోన్స్ పెద్దగా ఉండి చెవులను కప్పి ఉంటాయి. హెడ్‌ఫోన్స్ ఇయర్ కెనాల్ నుంచి కర్ణభేరి మధ్య దూరాన్ని పెంచుతాయి. వినికిడి లోపం వంటి సమస్యలు వచ్చే అవకాశం చాలా తక్కువ. బయట శబ్దాలు వినిపించకుండా ఉండడానికి ఎక్కువగా హెడ్‌ఫోన్స్ ఉపయోగిస్తున్నారు. వినియోగదారులకు వివిధ రకాల మోడళ్లు, పలు రకాల రంగుల్లో ఈ హెడ్‌ఫోన్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా రూ. వెయ్యి నుంచి రూ.రెండు వేలల్లో ఇవి లభ్యమవుతున్నాయి. బ్రాండెడ్ కంపెనీ హెడ్‌ఫోన్లు రూ.10 నుంచి రూ. 20 వేల ధరలో అందుబాటులో ఉంటున్నాయి.

అధికంగా కొనుగోలు చేసేది యువతే

హెడ్‌ఫోన్లను యువత అధికంగా కొనుగోలు చేస్తున్నారు. బైక్, కార్లలో దూరం ప్రయాణం చేసేటప్పుడు హెడ్‌ఫోన్లు పెట్టుకొని సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ వీడియోలు చూస్తూ ఆనందంగా గడిపేందుకు వీటిని అధికంగా కొనుగోలు చేస్తున్నారు. కాకినాడ నగరంలో సుమారు 80కిపైగా చిన్న, పెద్ద సెల్‌ఫోన్లు విక్రయించే దుకాణాలున్నాయి. సెల్‌ఫోన్లు విక్రయించే ప్రతి దుకాణంలో హెడ్‌ఫోన్లు విక్రయిస్తున్నారు. ప్రతి షాపులో రోజూ నాలుగు నుంచి ఐదు హెడ్‌ఫోన్లు విక్రయిస్తున్నారంటే వీటిని యువత ఎంతగా వినియోగిస్తున్నారో చెప్పాల్సిన అవసరం లేదు.

ఆన్‌లైన్‌లోనూ అధికంగా కొనుగోళ్లు

హెడ్‌ఫోన్లను వినియోగానికి ఆసక్తి చూపే యువత ఆన్‌లైన్ షాపింగ్‌లో అధికంగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఆన్‌లైన్ సంస్థల నుంచి పట్టణ పరిధిలో ప్రతి రోజు 30 నుంచి 40 హెడ్‌ఫోన్ల ఆర్డర్లు ఉంటున్నాయని డెలివరీ బాయ్ సతీష్ తెలిపారు.

ఆన్‌లైన్ క్లాసులకు వినియోగం

గంటల తరబడి ఆన్‌లైన్ క్లాసులు వినాల్సిన అవసరం వచ్చిన విద్యార్థులు అధికంగా హెడ్‌ఫోన్లు కొనుగోలు చేస్తున్నారు. సాధారణ ఇయర్ ఫోన్లు వినియోగిస్తే ఇబ్బందులు రావడంతో సౌండ్ సక్రమంగా వినిపించకపోవడంతో ఈ హెడ్‌ఫోన్లు అధికంగా వినియోగిస్తున్నారు.

ఎక్కువ సమయం వినియోగిస్తే అనర్థమే

ఎక్కువసేపు పెద్ద శబ్దంతో వింటే వినికిడి సమస్య వచ్చే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. వినికిడి సమస్య రాకుండా ఉండాలంటే తక్కువ శబ్దంతో వినాలని వారు సూచిస్తున్నారు. శబ్దాన్ని డెసిబుల్స్‌లో కొలుస్తారు. ఇయర్ ఫోన్ల నుంచి వచ్చే శబ్దం 60 డెసిబుల్స్ కంటే తక్కువగా ఉంటే వినికిడి సమస్య వచ్చే అవకాశం ఉండదు. ఇది 85 డెసిబుల్స్ దాటితే వినికిడి సమస్య ఏర్పడుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో హెడ్‌ఫోన్స్ వినియోగించే వారు ప్రతి అరగంటకు ఐదు నిమిషాలు వీలు కుదరకపోతే గంటకు పది నిమిషాల పాటు విరామం తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

యువత అధికంగా కొనుగోలు చేస్తున్నారు



సాధారణ ఇయర్ ఫోన్స్, ఇయర్ బడ్స్ వినియోగిస్తే బయట శబ్దం కూడా వినిపిస్తుంది. అదే హెడ్‌ఫోన్స్ అయితే బయటి శబ్దం అసలు వినబడదు. అందుకే యువత ప్రయాణం చేసేటప్పుడు అధికంగా వీటిని వినియోగించేందుకు కొనుగోలు చేస్తున్నారు.

– రాజా రవిశంకర్, సెల్ షాపు యజమాని